సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ॥ 14 ॥ సెప్టెంబర్ ॥ 2024



భవితకు బాసటగా..

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదేశాలతో పాటు, అప్రెంటిస్ యాక్ట్ ఆధారంగా సింగరేణిలో అప్రెంటిస్ షిప్ శిక్షణ ఇవ్వనున్నారు. 8లో



'పేట'లో పెరుగుతున్న అసమ్మతి

అశ్వారావుపేట కాంగ్రెస్‌లో అసమ్మతి పెరుగుతోంది. అధికార పార్టీలోని ఓ వర్గానికి చెక్ పడుతున్నట్లు తెలుస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం 32° / 22°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతంగా మారే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శుక్రవారం విజయవాడకు చెందిన భక్తులు ఉన్నం మురళీకృష్ణ దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పూజలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ దంపతులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతిని సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో..

శ్రీకనకదుర్గ అమ్మవారిని శుక్రవారం అడిషనల్ కలెక్టర్ డి.వేణుగోపాల్ దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనంతోపాటు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు.

18న మెడికల్ కళాశాలలో ఇంటర్వ్యూలు

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య కళాశాలలో ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు 9, అసోసియేట్ ప్రొఫెసర్ 35, అసిస్టెంట్ ప్రొఫెసర్ 14, ట్యూటర్ 17, సీనియర్ రెసిడెంట్ 52 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 18న 10: 30 నుంచి 3 గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

సింగరేణిలో లుకలుకలు!

- సంస్థలో రెండో అత్యున్నత పోస్టుగా డైరెక్టర్ 'పా'
- ఇప్పటివరకు అదనపు బాధ్యతలు నిర్వర్తించిన ఎన్‌వీకే శ్రీనివాస్
- అకస్మాత్తుగా డైరెక్టర్ పా బాధ్యతల్లో మార్పులు చేర్పులు
- రాజకీయ ఒత్తిళ్లే కారణమంటూ జోరుగా ప్రచారం



సింగరేణి ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కార్పొరేట్ ప్రభుత్వ రంగ సంస్థగా అపార అనుభవం, విశేష గుర్తింపు కలిగిన సింగరేణిలో లుకలుకలు మరోసారి బయటపడ్డాయి. సంస్థలో రెండో అతి పెద్ద పోస్టుగా పరిగణించే డైరెక్టర్ 'పా' కుర్చీ కేంద్రంగా ఇవి వెలుగు చూశాయి.

ఆ రెండు స్థానాల్లో..

వందేళ్ల చరిత్ర, ఒకప్పుడు లక్ష మంది కార్మికులు, వేల కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న సింగరేణి సంస్థ నిర్వహణ బాధ్యతలు చూసేందుకు ఇద్దరు ఆలిండియా స్థాయి (సివిల్స్) అధికారులను ప్రభుత్వం నియమిస్తూ వస్తోంది. ఇందులో ఒకరు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా అత్యున్నత స్థానంలో ఉండగా, రెండో స్థానంలో డైరెక్టర్ పా (పర్సనల్, అకౌంట్స్, వెల్ఫేర్) పోస్టు ఉంది. సాధారణంగా ఈ రెండు పోస్టుల్లో ఐఏఎస్‌లను నియమించడం ఆనవాయితీగా ఉండేది. పా విషయానికి వస్తే 2014 వరకు ఈ సంప్రదాయం కొనసాగింది. కానీ ఆ తర్వాత సంస్థలో వివిధ హోదాల్లో పని చేస్తూ డైరెక్టర్ స్థాయికి చేరుకున్న వారికి పా బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. ఇదే క్రమంలో ఎనిమిది నెలల కిందట పా హోదాలో ఉన్న ఐఆర్ఎస్ అధికారి ఎన్.బలరామ్ సీఎండీగా వెళ్లగా డైరెక్టర్ ఆపరేషన్స్‌గా ఉన్న ఎన్‌వీకే శ్రీనివాస్‌కు 'పా'గా 2014 జనవరి 21న బాధ్యతలు అప్పగించారు.

ఎనిమిది నెలలకే

సింగరేణిలో ఒక అధికారి 'పా' హోదాలో రెండున్నరేళ్లు పని చేయడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఏడాది పూర్తికాక ముందే 'పా' బాధ్యతల నుంచి ఎన్‌వీకే శ్రీనివాస్‌ను తప్పించారు. అమెరికాలోని కొలంబియాలో జరుగుతున్న అంతర్జాతీయ రెస్క్యూ పోటీలో పాల్గొనే సింగరేణి టీమ్‌తో పాటు ఎన్‌వీకే శ్రీనివాస్ విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. దీంతో తాత్కాలికంగా 'పా' బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనే చర్చ మొదలైంది. అయితే రెస్క్యూ పోటీలకు పది రోజులపాటు శ్రీనివాస్ సెలవు కోరగా పై నుంచి కేవలం నాలుగు రోజులకే అనుమతి వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో రెస్క్యూ టీంతో విదేశాలకు ఆయన వెళ్లలేదు. ఒక్కసారిగా సింగరేణిలో ఉన్నత స్థాయిలో అగ్గి రాజుకుంది. డైరెక్టర్ ఆపరేషన్స్ హోదాలో ఎన్‌వీఏ శ్రీనివాస్ నిర్వహిస్తున్న 'పా' బాధ్యతలు చూడాలంటూ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి (ప్రాజెక్ట్, ప్లానింగ్)కి ఆపరేషన్స్ బాధ్యతలు చూడాలంటూ డైరెక్టర్ సత్యనారాయణరావు (ఎలక్ట్రికల్, మెకానికల్)లకు మౌఖిక ఆదేశాలు వెళ్లాయి.

అసలు కథ ?

ఇటీవల రాష్ట్ర రాజధాని ప్రాంతం మినహాయించి ఇతర నియోజకవర్గాల్లో ఒక్కో ఎమ్మెల్యేకు రూ.2 కోట్ల వంతున సింగరేణి నుంచి రూ.200 కోట్లకు పైగా నిధులను కేటాయించే ప్రతిపాదనపై ఉన్నత స్థాయిలో చర్చ జరిగిందని, హోదాలో ఎన్‌వీకే శ్రీనివాస్ ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా గళం విప్పారని, అందువల్లే ఆయన సీటుకు ఎసరు వచ్చిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే గతంలో సింగరేణి అధికారిగా వివిధ హోదాల్లో ఎన్‌వీకే శ్రీనివాస్ తీసుకున్న నిర్ణయాల్లో దొర్లిన తప్పులు, సంస్థకు వాటిల్లిన నష్టాలతో కూడిన ఒక చిట్టా ఇప్పటికే సిద్ధమైందంటున్నారు.

కారణమిదే..

డైరెక్టర్ పా హోదాలో కొనసాగుతూ ప్రజాప్రతినిధులు, గుర్తింపు కార్మిక సంఘాల నుంచి వచ్చే ప్రతిపాదనలకు పరిష్కారం చూపడటంలో ఎన్‌వీకే శ్రీనివాస్ విఫలం అవుతున్నందనే 'పా' బాధ్యతలు కొత్త వారికి అప్పగించాల్సి వచ్చిందని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ నాయక్ వెల్లడించారు. కాగా సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా లేని అంశాల్లో తమకు సానుకూల ఫలితం రావాలి, కావాలి అంటూ ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నుంచి వచ్చే విజ్ఞప్తులు, ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసినందుకే ఎన్‌వీకే శ్రీనివాస్‌ను పా హోదా నుంచి తప్పిస్తున్నారనే చర్చ సింగరేణి హెడ్డాఫీసులో జరుగుతోంది. 'పా' పోస్టు వివాదంపై వివరణ కోసం ఎన్‌వీకే ప్రసాద్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రాజకీయ ఒత్తిళ్లు లేవు



'పా'గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్‌వీకే శ్రీనివాస్ (డైరెక్టర్, ఆపరేషన్స్) పనితీరుపై ప్రజాప్రతినిధులతో పాటు గుర్తింపు కార్మిక సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి, అంతేకాదు పా హోదాలో సమర్థంగా పని చేయడంలో ఆయన విఫలమయ్యారు. అందువల్లే వెంకటేశ్వరరెడ్డి (డైరెక్టర్, ప్రాజెక్ట్, ప్లానింగ్)ని పా బాధ్యతలు చూడమని చెప్పాము. పా బాధ్యతల మార్పుపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు.

–ఎన్.బలరామ్ నాయక్, సీఎండీ

ఓటరు 'ముసాయిదా' రెడీ

- గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచిన అధికారులు
- అభ్యంతరాల అనంతరం ఈనెల 28న తుది ఓటరు జాబితా విడుదల



చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్, సిబ్బంది

జిల్లాలోని గ్రామీణ ఓటర్ల వివరాలు	
మొత్తం ఓటర్లు	: 6,82,858
పురుషులు	: 3,32,940
మహిళలు	: 3,49,893
ఇతరులు	: 25

చుంచుపల్లి: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం అధికారులు సిద్ధమవుతున్నారు. ఓటరు జాబితాలను సిద్ధం చేయాలని గత నెలలో ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ముసాయిదా ఓటరు జాబితాలను అధికారులు సిద్ధం చేసి శుక్రవారం మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 6,82,858 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,32,940 మంది ఓటర్లు ఉండగా, మహిళలు 3,49,893 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు.

అధికారుల తీవ్ర కసరత్తు

జిల్లా పంచాయతీ అధికారులు కొన్ని రోజులుగా వార్డుల విభజన, ఓటరు జాబితాలపై తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు రిజర్వేషన్ల విషయం ఇంకా తేల్చాల్సి ఉంది. అయినా ఎన్నికల కోసం ముందస్తు తంతును పూర్తిచేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2 నుంచి గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. గతంలో 479 గ్రామపంచాయతీలకు మాత్రమే ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించారు. సారపాక, భద్రాచలం పంచాయతీలకు ఎన్నికలు జరపలేదు.

గతంలోని పొరపాట్లు మళ్లీ జరగకుండా..

2019 పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా రూపకల్పనలో అనేక పొరపాట్లు జరిగిన విషయం తెలిసిందే. ఒకే కుటుంబంలోని ఓటర్లు వేర్వేరు వార్డుల్లో ఉండటం, వార్డులు సైతం తారుమారు కావడం వంటి సమస్యలు తలెత్తాయి. అలాంటి పొరపాట్లను సరిదిద్ది ఓటరు జాబితాలను రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో అధికారులు తీవ్రస్థాయిలో కసరత్తు చేసి ముసాయిదా ఓటరు జాబితాలను గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గత పంచాయతీ ఎన్నికల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను పోల్చుకుంటూ కొత్తగా ఆయా వార్డులో ఎంత మంది ఓటర్లు చేరారో మార్పులు, చేర్పులు చేస్తూ ఓటరు జాబితా ముసాయిదాను రూపొందించారు. వీటిలో ఏమైనా పొరపాట్లు ఉంటే గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఇందుకు ఈ నెల 14 నుంచి 21 వరకు వీటిపై అభ్యంతరాలను స్వీకరించి తప్పులుంటే పంచాయతీ సిబ్బంది సరిదిద్దుతారు. ఈ నెల 26 వరకు అభ్యంతరాలను పరిష్కరిస్తారు. ఇక గ్రామ పంచాయతీల్లో ఈనెల 28న తుది ఓటరు జాబితాలను విడుదల చేస్తారు.

15న ఎలక్ట్రీషియన్ పోస్టులకు రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 133 ఎలక్ట్రీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 15న రాతపరీక్ష నిర్వహించనున్నారు. జనవరిలో విడుదల చేసిన ఇంటర్నల్ నోటిఫికేషన్ ద్వారా 190 మంది దరఖాస్తు చేసుకోగా రిక్రూట్‌మెంట్ సెల్ అధికారులు 178 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. అభ్యర్థులు ఈ నెల 15న కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు జరిగే రాతపరీక్షకు హాజరుకావాలని అధికారులు సూచించారు.

మహిళల భద్రతే ప్రధాన లక్ష్యం

ఎస్పీ రోహిత్‌రాజు



ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న షీ టీం జిల్లా ఇన్‌చార్జి పి.రమాదేవి, చిత్రంలో ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో షీటీం, ఏహెచ్‌టీయూ విభాగాల కార్యాలయాలను ప్రారంభించారు. కార్యాలయాలను షీ టీం జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఐ పి.రమాదేవి ప్రారంభించగా, ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడారు. మహిళలను వేధిస్తే జిల్లా షీ టీమ్ 87126 82131 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వేధిస్తున్న వ్యక్తులను షీ టీమ్ కార్యాలయానికి పిలిచి వాళ్ల తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తామని, పరిస్థితిని బట్టి నిందితుడిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. బాలికలు, మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిర్భయంగా షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, కళాశాలల తదితర రద్దీ ప్రాంతాల్లో షీ టీమ్ సభ్యులు సంచరిస్తూ ఆకతాయిల ఆగడాలను నిరోధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (ఆపరేషన్స్)పరితోష్ పంకజ్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, రమేష్‌కుమార్, నాగరాజు, శ్రీనివాస్, జితేందర్, ఆర్ఐలు సుధాకర్, రవి,లాల్‌బాబు, కృష్ణారావు, షీటీం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, ఎస్ఐ రమాదేవి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



చికిత్సకు వచ్చిన వారితో మాట్లాడుతున్న పీఓ రాహుల్

బూర్గంపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్యసేవలను అందించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ఆదేశించారు. బూర్గంపాడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(ప్రభుత్వ ఆస్పత్రి)ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని డ్రగ్ స్టోర్స్‌ను, లాబోరేటరీలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో వైరల్, డెంగీ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులలో 24 గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం బూర్గంపాడులోని గిరిజన సంక్షేమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు గణితంలో వెనుకబడి ఉండటంతో సంబంధిత ఉపాధ్యాయుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో సీహెచ్ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ అనిత, డాక్టర్ సబితారెడ్డి, డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

భద్రగిరి అభివృద్ధికి ముందడుగు

- తొలి విడతగా భూసేకరణకు రూ.60.20 కోట్లు విడుదల
- ఎన్నికల హామీ మేరకు నిధులిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇక భూ సేకరణ చేయనున్న రెవెన్యూ అధికారులు
- దేవస్థానం ఆధ్వర్యంలో నూతన మాస్టర్‌ప్లాన్..



భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయం

భద్రాచలం: ఎన్నో ఏళ్లుగా భద్రాచలంవాసులు, భక్తులు ఎదురు చూస్తున్న భద్రాచలం రామాలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నడుం బిగించింది. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్ అమలులో ముందడుగు పడింది. పదేళ్లలో బీఆర్ఎస్ మోసం చేసిందని, అధికారంలోకి వస్తే రామాలయ అభివృద్ధికి పాటుపడతామని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భద్రాచలంలో ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. తొలి విడతగా భూ సేకరణకు రూ.60.20 కోట్ల నిధులను విడుదల చేస్తూ జీఓ విడుదల చేశారు. దీంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

చివరికి కాంగ్రెస్ ప్రభుత్వమే కరుణించింది

భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లను ప్రకటించిన బీఆర్ఎస్ అధికారంలో ఉన్న రెండు పర్యాయాలు ఆ హామిని నేరవేర్చలేకపోయింది. ఆ ప్రభుత్వ తీరుపై పలుమార్లు వ్యతిరేకత వ్యక్తమైనా స్పందించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది శ్రీరామనవమికి ముందు సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటనకు వచ్చారు. ఆ సమయంలోనే రామాలయం, భద్రాచలం అభివృద్ధికి ప్రణాళికలను అందచేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ సూచనతో రెవెన్యూ, దేవస్థానం అధికారులు ప్రణాళికలను రూపొందించారు.

నిధుల విడుదల

రామాలయ అభివృద్ధికి ఆలయం చుట్టు పక్కల ఉన్న ఇళ్ల తొలగింపు, భూ సేకరణ ప్రధాన అడ్డంకిగా మారింది. దీంతో గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆలయానికి రెండు వైపులా భూ సేకరణపై అధికారులు తొలుత దృష్టి పెట్టారు. సుమారు రెండెకరాల స్థలం అవసరం కాగా, రెవెన్యూ, దేవస్థాన ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో భూ సేకరణ సర్వే జరిపారు. సుమారు 43 ఇళ్లను తొలగించాలని, భూ సేకరణకు సుమారు రూ.65 కోట్లు నిధులు అవసరమవుతాయని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీంతో ప్రభుత్వం తాజాగా భూ సేకరణకు రూ.60.20 కోట్లు విడుదల చేస్తూ జీఓ జారీ చేసింది. కాగా ప్రస్తుత మాస్టర్‌ప్లాన్ పదేళ్ల క్రితం రూపొందించనది కావడంతో దేవస్థానం అధికారులు కొత్త మాస్టర్ ప్లాన్ తయారుచేయనున్నారు.

భూ సేకరణకే ఆరు నెలలు..?

భూ సేకరణ రెవెన్యూ శాఖ చేపట్టనుంది. రెవెన్యూ అధికారులు తొలుత నోటిఫికేషన్ విడుదల చేసి, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, ఆ తర్వాత డిక్లరేషన్, చివరిగా నష్టపరిహారం అందించి, భూమిని సేకరించి దేవస్థానానికి అప్పగించనున్నారు. ఇందుకు సుమారు 6 నెలల సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆ తర్వాతే రామాలయ అభివృద్ధి పనులు పట్టాలెక్కే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు వస్తే పనులు ప్రారంభిస్తాం

భూ సేకరణకు దేవస్థానం అధికారుల నుంచి ప్రతిపాదనలు రాగానే పనులను ప్రారంభిస్తాం. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసి నష్టపరిహారం అందజేస్తాం. ఇందుకోసం సుమారు ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అభివృద్ధి పనుల త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

–కొల్లు దామోదర్‌రావు, ఆర్డీఓ, భద్రాచలం

'కరెన్సీ' గణపతి





ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినాయకుడిని రూ.7 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి దంపతులు పూజలు చేశారు. - ములకలపల్లి

ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్

పాల్వంచరూరల్: ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్ ఆదేశించారు. మండల పరిధిలోని పెద్దమ్మగుడి వద్ద గల జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీతో కలిసి తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీహెచ్‌సీలో ఓపీని పెంచాలని, అన్ని గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆదేశించారు. గర్భిణులను మూడు వారాలలోపు గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో డ్రాప్‌అవుట్ పిల్లలను గుర్తించి వందశాతం పిల్లలకు టీకాలు వేయాలన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ముందస్తు యాక్షన్ ప్లాన్‌ను తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణయ్య ఉన్నారు.

ఆదర్శనీయుడు భూపతిరావు



భూపతిరావు ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న హైకోర్టు జడ్జి భీమపాక నగేశ్, కుటుంబ సభ్యులు

భద్రాచలంఅర్బన్: పాలేరు మాజీ ఎమ్మెల్యే దివంగత భీమపాక భూపతిరావు చూపిన మార్గం ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భద్రాచలంలోని భూపతిరావు కాలనీలో శుక్రవారం ఆయన మొదటి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూపతిరావు కుమారులు తెలంగాణ హైకోర్టు జడ్జి భీమపాక నగేశ్, డాక్టర్ విద్యాసాగర్, భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో పాటు డాక్టర్ నారాయణ, న్యాయవాదులు రమణారావు, విద్యాసాగర్, నాగరాజు పాల్గొని భూపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే, తదితరులు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజల ఆశాజ్యోతిగా భూపతిరావు నిలిచారని, అందుకోసమే భద్రాచలంలోని ఓ కాలనీకి ఆయన పేరు పెట్టారని గుర్తుచేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సమాజంలో అందరికీ అందించేందుకు పోరాడారని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పడిసిరి శ్రీనివాస్, ఎస్కే.అజీమ్, రవికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భళా.. బాలల భక్త మండలి

ఘనంగా సిద్ధి వినాయక పూజలు



పూజలు చేస్తున్న బాలలు

ఇల్లెందు: ఇల్లెందు కొత్త కాలనీలోని 13వ వార్డులో ఏర్పాటు చేసిన శ్రీ సిద్ధి వినాయక భక్త మండలిలో అంతా బాలలే.. 20 మంది బాలలు ఉమేశ్, వర్షిత్, సందీప్, చరణ్, చందు, శశివర్దన్, కుమారస్వామి, హరిబాబు, మోనూ, సాయి చరణ్, చేతన్, ఇర్ఫాన్, అబ్బులు ఓ కమిటీగా ఏర్పడి స్థానిక కౌన్సిలర్ కడకంచి పద్మ సహకారంతో చందాలు పోగు చేసి శ్రీ సిద్ధి వినాయక భక్త మండలి ఆధ్వర్యంలో వినాయకుడిని నెలకొల్పారు. అందరి లాగానే పూజారిని ఏర్పాటు చేసుకుని, రోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక అన్నదానం కోసం కూడా ప్రత్యేకంగా చర్చలు జరిపి స్థానికుల సహకారం తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. 20 మంది కూడా 10 నుంచి 15 ఏళ్ల లోపు బాలలే కావటంతో అందరూ అభినందిస్తున్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేత



నియామకపత్రం అందజేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో విధులు నిర్వహించేందుకు ఒకరికి కారుణ్య నియామక పత్రంను ఆలయ ఈఓ బి.రమాదేవి శుక్రవారం అందజేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన రమేశ్‌బాబు భార్య సుష్మను ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఈఓ నియామకపత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు సింధు, గణేశ్

పాల్వంచ: పీడీఎస్‌యూ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం స్థానిక షాదీఖానా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా కె.సింధు (కొత్తగూడెం), ప్రధాన కార్యదర్శిగా జె.గణేశ్ (ఇల్లెందు), కోశాధికారిగా నవీన్ (పాల్వంచ), కార్యవర్గ సభ్యులుగా వివేక్, పవన్, కె.ప్రశాంతి, నాగబాబు, భరత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై పలు తీర్మానాలు, భవిష్యత్ కర్తవ్యాలపై సమీక్షించారు.

'మీ సేవ'కు అంతరాయం..



కరకగూడెంలో ఖాళీగా మీ సేవ కేంద్రం

కరకగూడెం: మీ సేవ కేంద్రాల్లోని మెయిన్ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ నెల 10వ తేదీ నుంచి పౌర సేవలు నిలిచిపోయాయి. దీంతో జిల్లావ్యాప్తంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటూ 'మీ సేవ'కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. రోజూ సుమారు 40 రకాల సేవలకు ఆటంకం కలుగుతోంది. సాంకేతిక నిపుణులు సమస్యను త్వరగా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కండక్టర్‌పై దాడి.. కేసు నమోదు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఆర్టీసీ డిపో గుండాల బస్సు సర్వీస్ కండెక్టర్‌పై దాడికి పాల్పడిన ప్రయాణికుడిపై కొమరారం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురం మానికి చెందిన రవి ఇల్లెందు నుంచి గుండాలకు వెళ్లే ఆర్టీసీ బస్సును పోలారం జీపీ భద్ర తండా వద్ద ఎక్కాడు. రూ.10 నోటును కండక్టర్ విజయలక్ష్మికి ఇచ్చి మర్రిగూడెం టికెట్ తీసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తాను రూ.200 నోటు ఇచ్చానని, చిల్లర తిరిగి ఇవ్వలేదని కండక్టర్‌తో రవి ఘర్షణకు దిగాడు. టికెట్ తీసుకునే సమయంలో రూ.పది నోటు మాత్రమే ఇచ్చావని కండక్టర్‌తోపాటు ప్రయాణికులు చెప్పినా రవి వినిపించుకోలేదు. కండక్టర్‌పై దాడికి పాల్పడగా ఆమె స్వల్పంగా గాయపడింది. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

భవితకు బాసటగా..



నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదేశాలతో పాటు, అప్రెంటిస్ యాక్ట్ ఆధారంగా ఏడాది కాలానికి సింగరేణి సంస్థలో అప్రెంటిస్ షిప్ శిక్షణ ఇవ్వనున్నారు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా శిక్షణ ఇవ్వనుండగా ఈ నెల 9న ఆన్‌లైన్‌లో మొదలైన దరఖాస్తుల స్వీకరణ 23వ తేదీతో ముగుస్తుంది. ఇప్పటికే సుమారు 2,400కు పైగా దరఖాస్తులు అందడంతో సింగరేణిలో అప్రెంటిస్ శిక్షణకు ఉన్న ఆదరణను తెలియజేస్తోంది. సింగరేణిలో అప్రెంటిస్ షిప్ పూర్తిచేసినట్లు సర్టిఫికెట్ జారీ అయితే సంస్థతో పాటు ఇతర చోట్ల ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత ఉండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. – సింగరేణి(కొత్తగూడెం)

- నిరుద్యోగులకు సింగరేణిలో అప్రెంటిస్‌షిప్ శిక్షణ
- ఈ ఏడాది 1,600 మందికి అవకాశం, 23 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఎంపికైతే ఏడాది పాటు శిక్షణ
- అర్హతల ఆధారంగా స్టైఫండ్ కూడా చెల్లింపు
- ఇప్పటికే 2,400కు చేరిన దరఖాస్తులు

1,600 మందికి శిక్షణ

సింగరేణి సంస్థ కొంతకాలంగా కార్మికుల పిల్లలకు, ప్రభావిత ప్రాంత నిరుద్యోగులకే కాక కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఇతర యువతకు కూడా అప్రెంటిస్ షిప్ శిక్షణ ఇస్తోంది. అంతేకాక శిక్షణ సమయంలో భృతి చెల్లిస్తున్నారు. ఆ తర్వాత సంస్థ ఆధ్వర్యాన ఇచ్చే సర్టిఫికెట్లు సింగరేణిలో నోటిఫికేషన్లు, ఇతర సంస్థల్లో ఉద్యోగాల భర్తీ సమయాన ఉపయోగపడుతున్నాయి. దీంతో ఏటా సింగరేణి అప్రెంటిస్ శిక్షణ నోటిఫికేషన్ రాగానే దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది 1,600 మందికి శిక్షణ ఇవ్వనుండగా.. శుక్రవారం నాటికి 2,400 దరఖాస్తులు అందడం విశేషం.

ఎవరెవరు అర్హులు?

ఐటీఐ ఉత్తీర్ణులై నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్‌సీవీటీ) కలిగిన వారు అప్రెంటిస్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లలో 80 శాతం సంస్థ ఉద్యోగు ల, కార్మికుల పిల్లలు, ప్రభావిత ప్రాంత (భూనిర్వాసితులు) నిరుద్యోగులకు కేటాయిస్తారు. మిగిలిన సీట్లను రాష్ట్రంలోని ఆరు జిల్లాల నిరుద్యోగ యువతకు కంపెనీ కేటాయిస్తుంది. ఈ మేరకు అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోగా www.apprenticeship india.orgతో పాటు సింగరేణి పోర్టల్ www. scclmines.com/ apprenticeshipలో నమోదు చేసుకున్నాక.. ఆన్‌లైన్ హార్డ్ కాపీతో ఇతర సర్టిఫికెట్లు జత చేసి ఏరియాల్లోని ఎంవీటీసీ కార్యాలయాల్లో అందజేయాలి. కాగా, దరఖాస్తులకు ఎస్సెస్సీ మెమో, సంతకంతో కూడిన పాస్ ఫొటో, ఐటీఐ మెమో (ఎన్‌సీవీటీ), ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ధ్రువపత్రం, ఆధార్ కార్డు, భూనిర్వాసితులైతే ఏరియా, భూమి వివరాలు, స్థానిక పాఠశాలల అధ్యయన ధ్రువపత్రమే కాక ఆయా ఏరియా గనుల హెచ్‌ఓడీ ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది.

ఉపకార వేతనం కూడా..

ఐటీఐలో రెండేళ్ల కోర్సు (ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్ – సివిల్) పూర్తిచేసిన వారికి అప్రెంటిస్‌లో భాగంగా నెలకు రూ.8,050 చొప్పున, ఏడాది కోర్సు (వెల్డర్, మోల్డర్, డీజిల్ మెకానిక్) పూర్తిచేసిన వారికి రూ.7,700 చొప్పున మస్టర్ల ఆధారంగా ఉపకార వేతనం చెల్లిస్తారు. ఐటీఐ అర్హత ఉన్న వారికే కాక గ్రాడ్యుయేట్లు, డిప్లొమా హోల్డర్లకు కూడా సింగరేణిలో శిక్షణ ఇవ్వనున్నారు. కాగా, రెండేళ్ల కిందటి వరకు ఉపకారవేతనంలో కేంద్ర ప్రభుత్వం (మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్) ద్వారా 50 శాతం మేర చెల్లించేది. కానీ, ఆ తర్వాత ఇవ్వకపోవడంతో సింగరేణి ద్వారానే ఏటా రూ.13కోట్లకు పైగా చెల్లిస్తున్నారు.

పారదర్శకంగా అభ్యర్థుల ఎంపిక

అప్రెంటిస్ షిప్ అభ్యర్థుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. దరఖాస్తుదారుల ప్రతిభ, సీనియారిటీ ఆధారంగా ఎంపిక చేస్తాం. ఇందులో భాగంగా సంస్థ నిబంధనలు తూచ తప్పక పాటిస్తాం. ఎంపికైన వారికి ఉపకారవేతనం చెల్లిస్తూనే శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ జారీ చేస్తాం.

– కృష్ణయ్య, జీఎం (హెచ్‌ఆర్‌డీ)

గత ఐదేళ్లలో అర్హతల ఆధారంగా అప్రెంటిస్‌షిప్ వివరాలు

సంవత్సరం	గ్రాడ్యుయేట్లు	డిప్లొమా అభ్యర్థులు	ఐటీఐ అభ్యర్థులు
2019-20	159	42	1,350
2020-21	50	25	1,222
2021-22	141	71	1,341
2022-23	435	165	1,342
2023-24	211	50	1,708



కొత్తగూడెం ఏరియా వర్క్‌షాప్‌లో శిక్షణ పొందుతున్న అప్రెంటిస్ ట్రైయినీలు (ఫైల్)

'పేట' కాంగ్రెస్‌లో పెరుగుతున్న అసమ్మతి

అధికార పార్టీలో ఓ వర్గానికి ఎదురుదెబ్బలు..



అశ్వారావుపేట: అశ్వారావుపేట కాంగ్రెస్‌లో అసమ్మతి పెరుగుతోంది. ఇప్పటివరకు పెత్తనం చెలాయిస్తున్న అధికార పార్టీలోని ఓ వర్గానికి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. పేటలో ఓ నాయకుడు 2004 నుంచి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి అధికారులపై పెత్తనం చెలాయించేవారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, సదరు నేత మళ్లీ హస్తం తీర్థం పుచ్చుకున్నాడు. ఎప్పటిలాగే వ్యవహరించసాగారు. పోలీస్ స్టేషన్, వివిధ కార్యాలయాల్లో అధికారులపై ఒత్తిడి చేస్తూ పనులు చేయించుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల ఆయన అనుచరుల తీరుతో గ్రూపు తగాదాలు పెరిగి తలబొప్పి కట్టినట్లు తెలుస్తోంది. పాత కాంగ్రెస్ వాళ్లమని చెప్పుకునే కొందరు సీనియర్ నాయకులు వెళితే పోలీస్ స్టేషన్ నుంచి బయటకు గెంటేసిన సంఘటనలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. కానీ కొద్ది రోజులుగా పరిస్థితి మారిందని, సదరు నాయకుడి పాచికలు పారడం లేదనే అభిప్రాయం ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

కొన్ని ఘటనలను పరిశీలిస్తే..

- అశ్వారావుపేట మండల కేంద్రంలోని కొత్త పేరాయిగూడెంలో గురువారం రాత్రి గణపతి నిమజ్జన ఊరేగింపులో ఓ వ్యక్తి 'జై జూపల్లి' అనే నినాదాలు చేయడంతో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తోపులాట జరిగి తండ్లాటకు దారితీసింది. డయల్ 100 ద్వారా వచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి రాగా, గొడవ సద్దుమణిగింది. ఉదయాన్నే పోలీస్ స్టేషన్‌కు రావాలని చెప్పి పోలీసులు వెళ్లిపోయారు. దెబ్బలు తగిలిన వ్యక్తి శుక్రవారం స్టేషన్‌కు వెళ్లి.. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరినా పోలీసులు ఖాతరు చేయనట్లు సమాచారం.
- మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో గురువారం రాత్రి వినాయక విగ్రహం ఊరేగింపులో యువతులతో అసభ్యకర నృత్యాలు నిర్వహించారు. పాత కాంగ్రెస్ నాయకుల సమాచారంతో పోలీసులు రాత్రికి రాత్రే డీజే బాక్సులను స్వాధీనం చేసుకుని నిర్వాహకులైన వల్లెపు వెంకన్నబాబు, రాంబాబుపై కేసు నమోదు చేశారు. ఇంకా విచారణలో నిందితులు పెరిగే అవకాశం ఉన్నట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.
- అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లు రెండింటిని శుక్రవారం తెల్లవారుజామున అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి మురళి, సెక్షన్ అధికారి సంపత్ కుమార్ పట్టుకున్నారు. డ్రైవర్లు బత్తుల పుల్లయ్య, రాకేశ్‌లపై కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేయొద్దని, ట్రాక్టర్లను వదిలేయాలని సదరు నాయకుడు పైరవీ చేసినా అధికారులు పట్టించుకోనట్లు సమాచారం. అయితే అధికారులు విధినిర్వహణలో అధికార పార్టీలోని ఏదో ఒక వర్గానికి తలొగ్గుతున్నారని, తీరు మార్చుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనిచేయాలని పలువురు కోరుతున్నారు.

రాజీనామా చేసి మళ్లీ గెలవండి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

భద్రాచలం: కాంగ్రెస్ పార్టీలో సత్తువ ఉంటే, వారి పార్టీ నాయకుల మీద నమ్మకం ఉంటే పది మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి గెలిపించుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం భద్రాచలంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం అభివృద్ధికి పార్టీ మారానని చెబుతున్న తెల్లం వెంకట్రావు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ప్రజాక్షేత్రంలో గెలిచేందుకు వెంకట్రావ్ సిద్ధమా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న దాడులు హేయనీయమని పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ గుండాలు చేస్తున్న దాడులకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, గోదవర్తి నర్సింహమూర్తి, సాగి శ్రీనివాస రాజు, ఆకోజు సునీల్ కుమార్, రమేష్, ప్రదీప్, యువరాజు తదితరులు ఉన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు..

కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ



సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలుపుతున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీహాల్‌లో సీతారాం ఏచూరి మృతికి కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, తోట మల్లేశ్వరావు, కోశాధికారి అరకల కరుణాకర్, దూదిపాల రవికుమార్, న్యాయవాదులు, జె.శివరాం ప్రసాద్, గడిదాసి కాంతయ్యలతో పాటు పలువురు న్యాయవాదులు, వై.బాబురావు, వి.వి.పురుషోత్తమరావు, ఆర్. విజయ్‌కుమార్, జీ.వీ.కే మనోహార్, అనుబోలు రాంప్రసాద్, అడపాల మహాలక్ష్మి, మల్లెల ఉషారాణి పాల్గొన్నారు.

'లక్ష్మీ'గణపతి..



సత్తుపల్లిలోని శ్రీప్రసన్న గణపతి క్షేత్రంలో 22ఏళ్లుగా గణేష్ నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహాగణపతి రూపంలో స్వామిని శుక్రవారం రూ.44 లక్షల కరెన్సీ నోట్ల మాలలతో అలంకరించారు. రూ.500 నోట్లు, రూ.100తో పాటు ఇతర నోట్లతో వివిధ ఆకృతుల్లో మాలలు చేసి అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. – సత్తుపల్లిటౌన్

'బొజ్జ' నిండేలా..

సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలో గణపతి నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ ప్రతిష్ఠించిన వాసవీగణపతికి భక్తులు శుక్రవారం 180 రకాల వంటకాలతో మహా నైవేద్యాన్ని సమర్పించారు. అంతేకాక కరెన్సీనోట్ల మాలలతో ఆకట్టుకునేలా స్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సత్తుపల్లిటౌన్



బ్లాస్టింగ్‌కు ఒకరోజు ముందే సమాచారం

ఓఎస్డీ పరితోష్ పంకజ్



తోగ్గూడెంలో క్వారీలను తనిఖీ చేస్తున్న ఓఎస్డీ

పాల్వంచరూరల్: క్వారీల్లో బ్లాస్టింగ్‌కు ఒక్కరోజు ముందే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, క్వారీల్లోకి వచ్చిన పేలుడు పదార్థాలు అసాంఘిక శక్తులకు చేరితే క్వారీల నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామని ఓఎస్డీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. మండలంలోని తోగ్గూడెంలోని ఏడు క్వారీలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం క్వారీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తనిఖీల్లో పేలుడు పదార్థాల వినియోగానికి సంబంధించిన రికార్డులు సక్రమంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. అసాంఘిక శక్తులకు క్వారీల నిర్వాహకులు సహకరిస్తే వారిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. సప్లయర్, క్వారీ యజమాని, సూపర్‌వైజర్, ఆపరేటర్లు అవకతవకలకు పాల్పడినా.. క్వారీకి వచ్చిన పేలుడు పదార్థాలు పక్కదారి పట్టించినా యాజమానులతోపాటు సంబంధించిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆశ్రమ పాఠశాల నుంచి విద్యార్థుల పరార్

- స్పందించని హెచ్‌ఎం
- ఆందోళనలో తల్లిదండ్రులు



ఈసం అభిరామ్



శెట్టుపల్లి గౌతమ్‌తేజ

టేకులపల్లి: హెచ్‌ఎం, వార్డెన్‌ల నిర్లక్ష్యం కారణంగా కోయగూడెం ఆశ్రమ పాఠశాల నుంచి ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు పరారయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం పెద్దతండా పంచాయతీ ఉయ్యాలబాడవ గ్రామానికి చెందిన ఈసం అభిరామ్, శెట్టుపల్లి గౌతమ్‌తేజ టేకులపల్లి మండలం కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వీరు బయటకు వెళ్లారు. ఈ విద్యార్థులకు వరుసకు అన్నయ్య అయిన తొమ్మిదోతరగతి విద్యార్థి సందీప్ పిల్లల తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి వచ్చారా అని ఆరా తీశాడు. పిల్లలు ఇంటికి రాలేదని కంగారుపడిన తల్లిదండ్రులు హుటాహుటిన రాత్రి కోయగూడెం ఆశ్రమ పాఠశాలకు వచ్చారు. పాఠశాలలోని గదులు, ఆవరణ మొత్తం వెతికారు. వెంటనే ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ వద్ద ఆరా తీస్తే ఇద్దరు విద్యార్థులు కొత్తగూడెం వైపు బస్సు ఎక్కి వెళ్లినట్లు చెప్పడంతో కొత్తగూడెం, పాల్వంచ బస్టాండ్‌లలో, ప్రధాన కూడళ్లలో వెతకడం ప్రారంభించారు. ఎక్కడా ఆచూకీ దొరక లేదని అభిరామ్ తండ్రి సురేశ్, గౌతమ్‌తేజ తండ్రి నరేశ్ వాపోయారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పిల్లలు ఇద్దరు పాఠశాల నుంచి వెళ్లిపోయి గంటలు గడుస్తున్నా హెచ్‌ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు సమాచారం తెలపాల్సి ఉన్నప్పటికీ వారు పట్టించుకోలేదు. వివరణ కోసం పాఠశాల హెచ్‌ఎంకు పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించినా ఆయన స్పందించలేదు. ఏటీడీఓ రాధ వివరణ కోరగా తనకు రాత్రి 9.30 గంటలకు విషయం తెలిసిందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ నిర్వహిస్తామని చెప్పారు.

దాడి కేసులో జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: భూమిలో ఫెన్సింగ్ వేస్తున్న వ్యక్తులపై కర్రలతో దాడి చేసి గాయపరిచిన ఘటనలో ముగ్గురు వ్యక్తులకు జైలుశిక్షతో పాటు రూ.1,500 జరిమానా విధిస్తూ శుక్రవారం కొత్తగూడెం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత తీర్పు చెప్పారు.. జూలురుపాడు మండలానికి చెందిన కొలిపాక వెంకటేశ్వర్లు తన ఎనిమిది గుంటల భూమిలో ఫెన్సింగ్ తీసివేసి ఉన్నందున, తిరిగి ఫెన్సింగ్ వేసేందుకు 02-05-2017 రోజున మధ్యాహ్నం వెళ్లాడు. తన తమ్ముడు శ్రీను, కుమారులు సురేశ్, సంతోష్‌లతో కలిసి ఫెన్సింగ్ వేస్తుండగా.. మంగళగిరి సుధాకర్, మంగళగిరి రవి, మంగళగిరి మార్కండేయులు అక్కడికి చేరుకున్నారు. వారిని బూతులు తిడుతూ కర్రలతో కొట్టడంతో గాయాలయ్యాయి. తమపై దాడి చేశారని కొలిపాక వెంకటేశ్వర్లు జూలురుపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు అనంతరం పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తొమ్మిది మంది సాక్షులను విచారించిన జడ్జి ముగ్గురిపై దాడి చేసినట్లు నేరం రుజువుకావడంతో మంగళగిరి సుధాకర్, మంగళగిరి రవి, మంగళగిరి మార్కండేయులకు పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను విశ్వశాంతి, నాగలక్ష్మి నిర్వహించారు. మహ్మద్ అబ్దుల్ అహ్మద్ అబ్దుల్ ఘని (కోర్టు డ్యూటీ ఆఫీసర్) జూలురుపాడు కోర్టు పీసీ పి.ఉపేందర్ సహకరించారు.

60 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెం ఎస్సీ కాలనీలో నిల్వ చేసిన 60క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, కొణిజర్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాలనీకి చెందిన అనిల్, రమేష్ స్థానికుల నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారు. ఈక్రమాన గురువారం రాత్రి బియ్యాన్ని తరలించేందుకు యత్నిస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సీఐ రామకృష్ణ నేతృత్వాన తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నారు. అయితే, బాధ్యులు ఘటనా స్థలం నుంచి పరారు కావడంతో బియ్యాన్ని కొణిజర్ల పోలీసులకు అప్పగించారు. కాగా, గురువారం అర్ధరాత్రి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నా పోలీసులు మాత్రం శుక్రవారం సాయంత్రం వరకు గుట్టుగా ఉంచి, ఆతర్వాత కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

చెల్లని చెక్కు కేసులో జైలు

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బిక్కం రజని శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడుకు చెందిన రుద్ర ఉపేందర్ వద్ద రఘునాథపాలెం మండలం కోటపాడుకు చెందిన కాముని రమేష్ 2016 అక్టోబర్ 30న రూ.1.75లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి రమేష్ 2017 ఫిబ్రవరి 17న చెక్కు ఇవ్వగా బ్యాంకులో జమ చేస్తే సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో ఉపేందర్ తన న్యాయవాది పొట్లపల్లి విప్లవ్‌కుమార్ ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈమేరకు విచారణలో నేరం రుజువు కావడంతో రమేష్‌కు మూడు నెలల జైలు శిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.1.75లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

పాలేరు ఏటి ఒడ్డున యువతి మృతదేహం

నేలకొండపల్లి: మండలంలోని రామచంద్రాపురంలో పాలేరు ఏటి ఒడ్డున చెట్టుకు ఓ యువతి మృతదేహం వేలాడుతుండగా స్థానికులు శుక్రవారం గుర్తించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో పరీవాహక ప్రాంతంలో గల్లంతైన యువతి మృతదేహం ఈ ప్రాంతానికి కొట్టుకొచ్చినట్లు భావిస్తున్నారు. పంజాబీ డ్రెస్ ధరించి ఉన్న మృతురాలి ఇతర ఆనవాళ్లు గుర్తించడం కష్టంగా మారింది. కూసుమంచి సీఐ సంజీవ్, నేలకొండపల్లి ఎస్సై పి.సంతోష్ చేరుకుని పూర్తిగా పాడైన స్థితిలో ఉన్న మృతదేహానికి ఘటనాస్థలిలోనే పోస్టుమార్టం నిర్వహించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ముదిగొండ: సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థిని కాలేజీకి వెళ్లాలని తల్లి సూచించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని రాఘవాపురానికి చెందిన దేశబోయిన రాకేశ్(18) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వినాయకచవితి సందర్భంగా ఇంటికి వచ్చిన ఆయనను రెండు రోజులుగా కళాశాలకు రావాలని ఫోన్ చేస్తున్నారు. దీంతో వెళ్లాలని తల్లి మందలించడమే కాక సాయంత్రం హాస్టల్‌కి దిగబెడదామని చెప్పిన తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన రాకేష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై రాకేష్ తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఇల్లెందు: బూర్గంపాడు మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన వేల్పుల నరేశ్ (36) ఈ నెల 8వ తేదీన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోగా.. భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దంపతుల మధ్య ఘర్షణ జరగడంతో ముసలిమడుగు నుంచి భార్యతో ఇల్లెందు పట్టణంలోని 13వ నంబర్‌బస్తీకి వచ్చాడు. ఇల్లెందులోనూ మరోమారు ఘర్షణ జరుగటంతో మనస్తాపం చెందిన నరేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని కాల్చుకున్నాడు. ఆయన్ని భద్రాచలం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అక్క ఉమా ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

నీటి గుంతలో పడి వృద్ధురాలు...

తల్లాడ: మండలంలోని కలకొడిమలో శుక్రవారం రాత్రి నీటి గుంతలో పడిన వృద్ధురాలు మృతి చెందింది. గ్రామానికి చెందిన గొల్లమందల ముత్తమ్మ(70) ఇంటి సమీపాన ఇటీవల కురిసిన వర్షాలతో సైడ్‌కాల్వ వెంట గుంతలో నీరు నిలిచింది. ముత్తమ్మ బయటకువెళ్లి వస్తుండగా చీకటిలో గుంత కన్పించకపోవడంతో కాలుజారి అందులో పడగా ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందింది.

అదుపుతప్పి బస్సును ఢీ కొట్టిన కంటెయినర్

ఏడుగురు దుర్మరణం

- అదే సమయంలో బస్సును ఢీ కొట్టిన మరో లారీ
- చిత్తూరు జిల్లా మొగిలి ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- మృతుల్లో తెలంగాణవాసి
- 31 మందికి గాయాలు, 9 మంది పరిస్థితి విషయం



ప్రమాద ధాటికి నుజ్జునుజ్జు అయిన బస్సు, లారీ

పలమనేరు: ఘాట్ రోడ్‌లో అదుపు తప్పిన కంటెయినర్ మృత్యువాహనమైంది. డీజిల్ ఆదా కోసం ఆ కంటెయినర్ డ్రైవర్ చేసిన పని నడిరోడ్డుపై రక్తాన్ని ఏరులై పారించింది. శుక్రవారం చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని మొగిలి ఘాట్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడిక్కడే మృత్యు ఒడికి చేరుకున్నారు. మరో 31 మంది గాయపడగా.. వారిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉంది. బెంగళూరు నుంచి ఓ కంటెయినర్ సుమారు 100 టన్నుల ఇనుప కమ్మీలతో చెన్నైకి బయలుదేరింది. మొగిలి ఘాట్ పల్లంగా ఉండటంతో డీజిల్ ఆదా కోసం డ్రైవర్ వాహనాన్ని న్యూట్రల్ చేశాడు. లారీ 100 కి.మీ. పైగా వేగంగా వెళుతుండగా బ్రేక్ ఫెయిల్ అయ్యింది. దీంతో లారీ అదుపుతప్పి డివైడర్‌ని దాటి చిత్తూరు–బెంగళూరు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో తిరుమల నుంచి బెంగళూరుకు 52 మంది ప్రయాణికులతో వెళుతున్న అలిపిరి డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సును వేగంగా ఢీ కొట్టింది. ఆ వేగానికి బస్సు వెనక్కి తిరిగిపోయింది. అదే సమయంలో బస్సు వెనుక వస్తున్న మరో లారీ ఆ బస్సును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడిక్కడే మృతి చెందారు. కొందరు బస్సులోనే నుజ్జు నుజ్జయి ప్రాణాలు విడిచారు. మరి కొందరు కంటెయినర్‌లోని ఇనుప కమ్మీలు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ముగ్గురి శరీరభాగాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమయ్యాయి. ప్రమాద సమయంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. మరణించిన వారిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బల్లరాజు(55) ఉన్నారు.



పిఠాపురంలో భారీగా హాజరైన జనసందోహానికి వైఎస్ జగన్ అభివాదం

నిన్న బుడమేరు.. నేడు ఏలేరు

నిర్లక్ష్యమే ముంచేసింది

ఇది ఏమాత్రం బాధ్యత లేని ప్రభుత్వం • ఏలేరు వరద ప్రాంతాల పర్యటనలో వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వరదల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని.. వరద హెచ్చరికలను పెడచెవిన పెట్టి విజయవాడను ముంచేసిన మాదిరిగానే ఏలేరు వరద విషయంలో అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతుల నోట్లో మట్టి కొట్టిందని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఒక బాధ్యత లేని ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఏలేరు రిజర్వాయర్‌కు వరద వస్తుందని, అది ప్రమాదకర స్థాయిలో ఉంటుందని ప్రభుత్వానికి ముందే సమాచారం అందినా కాలువ ద్వారా నీటిని వదలకుండా తాత్సారం చేసి చివరకు సామర్థ్యానికి మించి వదిలి ముంచేశారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్, రెవెన్యూ, హోంశాఖలతో కనీసం సమీక్షించకుండా సీఎం చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. విజయవాడ ఎలా అతలాకుతలమైందో అలాంటి నిర్లక్ష్యమే ఏలేరు విషయంలోనూ కనిపిస్తోందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో వైఎస్ జగన్ శుక్రవారం పర్యటించారు. మాధవాపురం, పాత ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అనంతరం రమణక్కపేటలో మీడియాతో మాట్లాడారు. ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమాను గాలికొదిలేసి రైతులను ప్రభుత్వం నట్టేట ముంచేసిందని దుయ్యబట్టారు. ఈ క్రాప్ నమోదు చేయడం లేదని, ఆర్బీకేలను అడ్రస్ లేకుండా చేశారని, సచివాలయాలను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రన్న వస్తాడు.. రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తాడన్న హామీ ఏమైందని నిలదీశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మనుషుల విలువ తెలిసి ఉంటే..

ఏలేరు రిజర్వాయర్ దగ్గర పరిస్థితిని చూస్తే విజయవాడ గుర్తుకొస్తోంది. అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆగస్టు 31నే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఐఎండీ (భారత వాతావరణ విభాగం) అప్రమత్తం చేసింది. అలాంటి హెచ్చరిక అందగానే ప్రభుత్వం సమీక్ష నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. రెవెన్యూ, హోం, ఇరిగేషన్ కార్యదర్శులతో సమీక్ష చేయాలి. కానీ ముందే సమాచారం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. కలెక్టర్లతో మాట్లాడలేదు. సీఎస్ కూడా ఏమాత్రం పట్టించుకోలేదు. సీఎం చంద్రబాబుకు మానవత్వం ఉంటే, మనుషుల విలువ తెలిసి ఉంటే స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి ఎప్పటికప్పుడు పరిస్థితి తెలుసుకుని ముందు జాగ్రత్తలు చేపట్టే వారు. కానీ అవేమీ చేయలేదు. అన్నీ గాలి కొదిలేశారు.

సామర్థ్యానికి మించి ఒకేసారి నీటి విడుదలతో..

ఏలేరు రిజర్వాయర్ సామర్థ్యం దాదాపు 24 టీఎంసీలు కాగా 31వతేదీ నాటికే సుమారు 18 టీఎంసీలు ఉన్నాయి. సెప్టెంబర్ 1న ఏలేరు రిజర్వాయర్‌కు 9,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రభుత్వం జాగ్రత్త పడి ఉంటే, ఫ్లడ్ కుషన్ నిబంధన పాటించి ఉంటే ఆ మొత్తం వెంటనే కిందకు వదలాలి. ఎందుకంటే దిగువన కాలువ సామర్థ్యం 14 వేల క్యూసెక్కులు మాత్రమే. అలా అప్పుడే నీళ్లు దిగువకు వదిలి ఉంటే ఆ కాలువ పొంగకుండా ఉండేది. కానీ ప్రభుత్వం కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే వదిలిపెట్టింది. సెప్టెంబరు 4న 5,400 క్యూసెక్కులు వస్తే బయటకు పంపింది కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే. ఏమాత్రం ఫ్లడ్ మేనేజ్‌మెంట్ చేపట్టలేదు. ఫ్లడ్ ఫ్లో కుషన్ ఏర్పాటు చేయలేదు. పైనుంచి నీళ్లొస్తున్నా తీవ్ర నిర్లక్ష్యం వహించారు. కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే వదులుతూ వచ్చారు. దీంతో 9వతేదీ నాటికి ఏలేరు రిజర్వాయర్ పూర్తిగా నిండింది. దీంతో గత్యంతరం లేక కిందకు 21,500 క్యూసెక్స్ వదిలారు. 10వ తేదీన 26,134 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే ఏకంగా 27,275 క్యూసెక్స్ విడిచిపెట్టారు. అంటే కాలువ సామర్థ్యాన్ని మించి నీళ్లు వదలడంతో లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. మరి ఇది కచ్చితంగా ''మేన్ మేడ్ ఫ్లడ్'' కాకపోతే మరేమిటయ్యా! అని అడుగుతున్నా. ప్రజలు పట్ల మానవత్వం చూపని, ఏమాత్రం బాధ్యత లేని ప్రభుత్వం ఇది. వరదలు వస్తే ఎలా హ్యాండిల్ చేయాలో కనీసం ఇంగితం లేని ప్రభుత్వం ఇది!

ఏలేరు ఆధునీకరణపై అబద్ధాలు..

అబద్ధాలు చెప్పడంలో సీఎం చంద్రబాబు గోబెల్స్‌కు తమ్ముడే. పచ్చి అబద్ధాలాడతారు. అబద్ధాలను సృష్టించడం, వాటిని అమ్ముగలగడంలో చంద్రబాబును మించిన వారు ప్రపంచంలోనే లేరు. ఆయనకు వంత పాడే మీడియా నిత్యం అవే అబద్ధాలను ప్రచారం చేస్తోంది. ఏలేరు ఆధునికీకరణపైనా చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారు. తొలుత ఏలేరు కాలువ ఆధునికీకరణను 2008లో దివంగత వైఎస్సార్ రూ.138 కోట్లతో చేపట్టారు. ఆ తర్వాత ఎవరూ ఆ పనులను పట్టించుకోలేదు. వర్షాలు, నీళ్లు లేనప్పుడు మాత్రమే కెనాల్ ఆధునికీకరణ చేయగలం. లేదంటే క్రాప్ హాలిడే ప్రకటిస్తే కానీ సాధ్యం కాదు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక అంచనాలు రూ.295 కోట్లకు పెంచడం మినహా పనులు చేయలేదు. నిజానికి అప్పుడు రిజర్వాయర్‌లో నీళ్లు కూడా పెద్దగా లేవు. నాడు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏటా కరువే. చంద్రబాబు – కరువు ఇద్దరూ కవలలే. అప్పుడు వర్షాలు కూడా లేవు. అయినా పనులు ఎందుకు చేయలేదు? 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వరుసగా వర్షాలు కురవడంతో క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కాలువ ఆధునికీకరణ పనులు వేగంగా చేయలేకపోయాం.

ఏం జరిగినా జగనే కారణం అంటాడు

ఏలేరు వరదలపై ప్రభుత్వానికి ముందే ఇంత సమాచారం ఉన్నా తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. ఫ్లడ్ కుషన్ మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబు విఫలమై రైతులందర్నీ ఇబ్బంది పెట్టారు. వరదలు వస్తే రిజర్వాయర్లను ఎలా నిర్వహించాలో ఈ ప్రభుత్వానికి తెలియడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి దాదాపు నాలుగు నెలలు అయింది. ఎక్కడ ఏం జరిగినా దానికి కారణం జగనే కారణం అంటాడు. విజయవాడలో వరదలు వచ్చినా జగనే కారణం.. ! ఏలేరు రిజర్వాయర్ కింద వరదలు వచ్చినా జగనే కారణం..! కోవిడ్ వచ్చినా జగనే కారణం.. అంటాడు! చంద్రబాబు చేయాల్సింది జగన్నామస్మరణ కాదు. ప్రతి దానికి జగన్‌పై అరవకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఇప్పటికైనా నా మమ్మల్ని నిందించడం మానుకుని ప్రజలకు క్షమాపణ చెప్పి నిజాయితీగా పాలన అందించాలి.

సకాలంలో మెడికల్ కౌన్సెలింగ్ పూర్తి

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కౌన్సెలింగ్ కోసం ఎదురు చూ స్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందనక్కర్లేదని, వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ఇచ్చిన గడువులోగా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌ను పూర్తి చేసి, తరగతులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులకే సీట్లు దక్కాలన్నది తమ ఆలోచన అని, ఈ విషయంలో రాజీ పడేది లేదని పేర్కొన్నారు. వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని, ఈలోగా వెబ్ ఆప్షన్ల నమోదు కోసం విద్యార్థులు సిద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల వివరాలు, సీట్ల వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో (https://www.knruhs.telangana. gov.in/) అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. గతేడాది ఏయే ర్యాంకు విద్యార్థులకు ఏయే కాలేజీల్లో సీట్లు వచ్చాయన్న వివరాలను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఆయా వివరాలను పరిశీలించి, తమ ర్యాంకులకు అనుగుణంగా వెబ్ ఆప్షన్ల కోసం జాబితాను సిద్ధం చేసుకోవాలని మంత్రి సూచించారు.

ట్రాన్స్‌జెండర్ల కోసం జిల్లాకో క్లినిక్

వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రతి జిల్లాకో క్లినిక్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న జిల్లా ఆస్పత్రులు లేదా బోధన ఆస్పత్రుల్లోనే వీటిని ఏర్పాటు చేయనున్నారు. అవసరాన్ని బట్టి వారానికి రెండు లేదా మూడు రోజుల పాటు క్లినిక్స్ నిర్వహించనున్నారు. ప్రతి క్లినిక్‌లో జనరల్ ఫిజీషియన్, డెర్మటాలజిస్ట్, సైకియాట్రిస్ట్ అందుబాటులో ఉంటారు. అవసరాన్ని బట్టి గైనకాలజిస్ట్, యూరాలజిస్ట్, ఇతర స్పెషలిస్ట్ డాక్టర్లను డిప్యూట్ చేస్తారు. వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా ఈ క్లినిక్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే ఉత్తర్వులు కూడా జారీ చేశారు. తాము అనారోగ్యం బారిన పడ్డప్పుడు ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నామని, ఒకవేళ ధైర్యం చేసి వెళ్లినా అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ట్రాన్స్‌జెండర్లు ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఆస్పత్రుల్లో తమకోసం ప్రత్యేకంగా ఓ రూమ్ కేటాయించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్ల కోసం క్లినిక్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతేకాదు, అవసరమైన వారికి జెండర్ మార్పిడి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయించనున్నారు. ఇందు కోసం కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవలే ఓ ప్రొసీజర్‌ను విడుదల చేసింది. తొలుత హార్మోనల్ బ్యాలన్స్ కోసం చికిత్స అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటివి చేసి, అప్పటికీ సెట్ అవ్వకపోతేనే జెండర్ మార్పిడి సర్జరీలు చేయాలని పేర్కొంది. ఇప్పటికే ఉస్మానియా ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాల నుంచి రోగులను ఇక్కడికే రిఫర్ చేయనున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ట్రాన్స్‌జెండర్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ విధులు అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వలంటీర్లుగా పనిచేసే ట్రాన్స్‌జెండర్లకు ప్రతినెలా కొంత స్టైఫండ్ ఇవ్వాలని, దీంతో వారికి ఆర్థికంగా భరోసా కల్పించడంతో పాటు సమాజంలో గౌరవస్థానం కల్పించవచ్చునని సీఎం పేర్కొన్నారు. ఆసక్తిగా ఉన్న ట్రాన్స్‌జెండర్ల వివరాలను సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వారం, పది రోజుల పాటు వారికి అవసరమైన ప్రత్యేక శిక్షణను కూడా అందించాలని, విధుల్లో ఉండే ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక యూనిఫామ్ కూడా ఉండాలని అధికారులకు సూచించారు. శుక్రవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఇతర అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్షా సమావేశం సందర్భంగా సీఎం ఈ విషయం వెల్లడించారు. సీఎం నిర్ణయంతో ఈ కార్యక్రమం విజయవంతమైతే దేశంలో ఇతర నగరాలు కూడా దీనిని ఆదర్శంగా తీసుకునే అవకాశం ఉంది.

జిల్లా వార్తలు

వైద్యుల నియామకానికి 21న ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని వివిధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యనిపుణుల పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయన్నారు. ఏడాదికి కాలానికి నియామకాలు చేపడుతుండగా ఈనెల 21న కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. రేడియాలజిస్ట్, ఆర్థో సర్జన్ పోస్టులు మూడు చొప్పున, అనస్తీషియన్, ఈఎన్‌టీ సర్జన్, జనరల్ సర్జన్, ఫిజీషియన్, ఆప్తాల్మజిస్ట్, పీడియాట్రీషియన్ పోస్టులు రెండు చొప్పున, చెస్ట్ ఫిజీషియన్ పోస్ట్ ఒకటి భర్తీ చేయనుండగా ఆయా విభాగాల్లో అర్హత కలిగి, 64ఏళ్ల లోపు వయస్సు ఉన్న వైద్యులు ఈనెల 18న లోపు www.scclmines.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.1.25లక్షల వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్ర బృందం తనిఖీ



సెంటర్‌లో చిన్నారులతో అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం అర్బన్ పరిధిలోని శాంతినగర్–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర స్థాయి బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారుల బరువు, వారికి అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించారు. బృందంలో ఏడీలు జ్యోతి, విజయలక్ష్మి ఉండగా అర్బన్ సీడీపీఓ వీరభద్రమ్మ, ముస్తఫానగర్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి 83 శాతమే...



ఓసీలో బొగ్గు లోడ్ చేస్తున్న వాహనం

ఆగస్టు నెలలో ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి వివరాలు (టన్నుల్లో)

ఏరియా	లక్ష్యం	ఉత్పత్తి	శాతం
కొత్తగూడెం	9,96,500	9,93,318	101
ఇల్లెందు	2,59,000	3,29,200	127
మణుగూరు	7,98,500	5,34,316	67
బెల్లంపల్లి	2,40,000	1,15,452	48
మందమర్రి	2,51,500	1,90,008	76
శ్రీరాంపూర్	4,54,900	2,68,817	59
ఆర్జీ–1	3,65,700	2,90,648	79
ఆర్జీ–2	4,78,400	4,40,009	92
ఆర్జీ–3	4,14,520	4,44,520	99
అడ్రియాల	17,400	10,948	63
భూపాలపల్లి	2,61,700	1,74,641	67

సింగరేణి వ్యాప్తంగా గత నెలలో 37.61 లక్షల టన్నులు

- రెండు ఏరియాల్లోనే 100 శాతం ఉత్పత్తి
- గడిచిన ఐదు నెలల్లో కూడా నెరవేరని లక్ష్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఆగస్టులో నిర్దేశిత 45.42 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 37.61 లక్షల టన్నులు(83 శాతం) మాత్రమే సాధించగలిగింది. అంటే సుమారు 8 లక్షల టన్నుల వెనుకంజలో ఉంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం గడిచిన ఐదు నెలల్లో పరిశీలిస్తే 26.38 మిలియన్ టన్నుల లక్ష్యానికి 24.70 మిలియన్ టన్నులే(94 శాతం) సాధించడం గమనార్హం. అయితే, గత మూడు నెలల్లో, ఈ నెల మొదటివారం భారీ వర్షాలు కురవగా.. ఓసీల్లో నీరు నిలవడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు.

ఓసీల్లో అధికం

సంస్థ పరిధిలోని 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి నమోదవుతోంది. ఓసీల్లో గడిచిన ఐదు నెలలకు గాను 23.75 మిలియన్ టన్నుల లక్ష్యంలో 22.57 మిలియన్ టన్నులు(95 శాతం) సాధించారు. ఇక 22 భూగర్భ గనుల్లో 26.36 లక్షల టన్నుల లక్ష్యానికి 21.23 లక్షల టన్నులు(81శాతం) ఉత్పత్తి నమోదైంది. రోజువారీగా పరిశీలిస్తే ఓసీల్లో 60శాతం, భూగర్భగనుల్లో 75 శాతం సాధించాయి.

రెండు ఏరియాల్లో పర్వాలేదు..

సింగరేణి సంస్థ ఆరు జిల్లాల్లో విస్తరించి ఉండగా 11 ఏరియాలకు కలిపి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించింది. సంస్థ వ్యాప్తంగా 22 భూగర్భగనులు, 18 ఓసీలు ఉండగా.. కొన్ని ఏరియాలు 100శాతం ఉత్పత్తి సాధిస్తున్నా ఇంకొన్ని వెనకబడుతున్నాయి. ఆగస్టులో కొత్తగూడెం ఏరియా 101శాతం, ఇల్లెందు ఏరియా 127 శాతం ఉత్పత్తి సాధించాయి. ఇక మణుగూరు ఏరియా 67శాతం, బెల్లంపల్లి 48, మందమర్రి 76, శ్రీరాంపూర్ 59, ఆర్జీ–1 ఏరియా 79, ఆర్జీ–2 ఏరియా 92, ఆర్జీ–3 ఏరియా 99శాతం, అడ్రియాల 63, భూపాలపల్లి 67శాతం ఉత్పత్తి సాధించాయి. కాగా, గడిచిన ఐదు నెలల్లో ఇల్లెందు ఏరియా 116 శాతం, ఆర్జీ–2 ఏరియా 126 శాతం సాధించాయి. మిగిలిన వాటిలో కొత్తగూడెం ఏరియా 94, మణుగూరు 93, బెల్లంపల్లి 93శాతం, మందమర్రి 80, శ్రీరాంపూర్ 73, ఆర్జీ–1 ఏరియా 87, ఆర్జీ–3 ఏరియా 96, అడ్రియాల 95, భూపాలపల్లి ఏరియా 69 శాతానికి పరిమితమయ్యాయి. కొత్తగూడెం ఏరియాకు ఈ ఆర్థిక సంవత్సరం 145 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా ఈ ఐదు నెలల్లో 51.70 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదు చేసి అగ్రస్థానంలో నిలిచింది.

జీఎం పోస్టులకు పోటాపోటీ

- సింగరేణి భవన్ చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు
- పోస్టులు ఆశిస్తున్న ఇద్దరు మహిళా అధికారులు?



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): ఆరు జిల్లాల పరిధిలో విస్తరించిన సింగరేణి సంస్థలోని 11 ఏరియాలకు అంతే సంఖ్యలో జీఎంలు ఉండగా, మరో 35 మంది సంస్థ వ్యాప్తంగా వివిధ విభాగాల జీఎంలు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఎక్కడ జీఎంగా పనిచేసినా జీతభత్యాలు సమానంగానే ఉంటుండగా.. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో పనిచేసే వారికి మాత్రం అలవెన్స్‌లు కాస్త ఎక్కువగా అందుతాయి. ఇక విధుల విషయంలో కార్పొరేట్ కార్యాలయంలోని వారితో పోలిస్తే ఏరియాల జీఎంలకు కొద్దిమేర స్వాతంత్రం ఉంటుందని చెబుతారు. ఈ నేపథ్యాన గతంలో సింగరేణి సీఎండీ, డైరెక్టర్ల సూచనల మేరకు పోస్టింగ్ ఇచ్చేవారు. కానీ ఇటీవల సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడంతో కొందరు రాష్ట్ర మంత్రులతో పదవుల కోసం సిఫారసు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది.

పర్సనల్ విభాగం జీఎంల కోసం..

సింగరేణి సంస్థలో కీలకమైన కార్పొరేట్ కార్యాలయంలో జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) పోస్టు గత నెల 31న ఖాళీ అయింది. అంతకంటే ముందు మరో విభాగం జీఎం వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. గతంలో వెల్ఫేర్, ఆర్సీకి కలిపి ఒక జీఎం, ఐఆర్‌పీఎం, సెక్యూరిటీ విభాగాలకు కలిపి ఒక జీఎం ఉండేవారు. ఇప్పుడు ఈ రెండు పోస్టులు ఖాళీ అవుతుండడంతో ఇద్దరు మహిళా జీఎంలు వారికి ఉన్న పోస్టులు కాకుండా వీటి కోసం సింగరేణి భవన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం.

డైరెక్టర్ పోస్టుల నుండి పైరవీలు మొదలు..

సంస్థలో ప్రధానంగా సీఎండీతో పాటు డైరెక్టర్లలో పా, ఆపరేషన్స్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్, ఈ అండ్ ఎం, ఫైనాన్స్ పోస్టులు కీలకమైనవిగా చెప్పాలి. ఇక మరో ముగ్గురు డైరెక్టర్లు సింగరేణి భవన్‌లో ఉంటారు. అయితే ప్రధానమైన సీఎండీ, ఒకరిద్దరు డైరెక్టర్లను ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను నియమిస్తుంది. ఆపై మిగతా పోస్టుల్లో ఉద్యోగుల్లో అనుభవం, పనితీరు ఆధారంగా నియమించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే, ఈ ప్రక్రియలో భారీగా పైరవీలు జరిగాయని తెలుస్తుండగా.. జాబితాలో కింద ఉన్న వారిని ఎంపిక చేయడంతో ఒకరిద్దరు అధికారులు ఇబ్బంది పడినట్లు ప్రచారం జరిగింది. ఇక ఇప్పుడు జీఎం పోస్టుల కోసం అధికారులు పైరవీలు మొదలుపెట్టడం చర్చనీయాంశంగా మారింది.

ప్రతీ మండపానికి జియో ట్యాగింగ్

- వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు
- జిల్లాలో 2,500 వినాయక విగ్రహాలు



రాజేశ్వరపురంలో వినాయక మండపం వద్ద జియో ట్యాగింగ్ చేస్తున్న నేలకొండపల్లి పోలీసులు

నేలకొండపల్లి : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగే నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అపశ్రుతి జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని మండపాల వివరాలు సేకరించి వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 2,500 వినాయక మండపాలకు జియో ట్యాగింగ్ పూర్తి చేశారు. ప్రతీ మండపం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ మేరకు ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో మండపాల వద్దకు సిబ్బంది వెళ్లి వివరాలు, మండపాల ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ పూర్తయింది.

నిమజ్జనానికి రూట్‌మ్యాప్ కూడా..

జిల్లాలోని వినాయక మండపాలకు సంబంధించిన వివరాలతో నిమజ్జన సమయంలో రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేస్తున్నారు. మండపాల నిర్వాహకుల వివరాలు, సెంటర్, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఎక్కడ నిమజ్జనం చేస్తారు.. ఇలా ప్రతీ విషయాన్ని పోలీస్ యాప్‌తో అనుసంధానం చేస్తున్నారు. తద్వారా భద్రత చర్యలు తీసుకోవడం సులభమవుతుందని పోలీస్, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది తెలిపారు. మండపాల వద్ద ఎలాంటి సమస్య తలెత్తినా సమాచారం అందే అవకాశం ఉంటుంది. పోలీస్ అప్లికేషన్‌లోని లొకేషన్ ఆప్షన్ నొక్కగానే మండప ప్రాంతం తెలుస్తుంది. దీంతో వెంటనే అక్కడికి పోలీసు సిబ్బంది చేరుకునేలా ఏర్పాటు చేశారు.

నిర్వాహకులు సహకరించాలి



మండపాల వద్ద ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రతీ మండపాన్ని జియో ట్యాగింగ్ చేశాం. ఎక్కడ సమస్య వచ్చినా తెలుస్తుంది. పోలీస్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటారు. నిమజ్జనం కూడా శాంతియుతంగా పూర్తయ్యేలా నిర్వాహకులు సహకరించాలి.

– పి.సంతోష్, ఎస్సై, నేలకొండపల్లి

సిద్ధమైన ఖమ్మం–డోర్నకల్ రహదారి

రఘునాథపాలెం మండలంలోని కోయచలక–కోటపాడు మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి వరదతో కోతకు గురికాగా ఇన్నాళ్లు ఖమ్మం – డోర్నకల్ నడుమ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే, రహదారి భారీగా కోతకు గురి కావడంతో శ్లాబ్ కల్వర్టు నిర్మాణానికి సమయం పడుతుందని భావించిన అధికారులు తాత్కాలికంగా సమీపం నుండి డైవర్షన్ రోడ్డు నిర్మించారు. నీరు సాఫీగా సాగేలా పైపులు వేసి మట్టి నింపి తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు పనులు పూర్తవడంతో శుక్రవారం సాయంత్రం రాకపోకలు మొదలయ్యాయి. – రఘునాథపాలెం



సిద్ధమైన డైవర్షన్ రహదారి